ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 201 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 29 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## టాటా-ఎయిర్‌బస్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

### స్పెయిన్ ప్రధానితో రోడ్ షో.. లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీ




2లో..

# ఆగని బెటాలియన్ పోలీసుల నిరసన

## సచివాలయముట్టడికి యత్నం.. పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం): :రాష్ట్రమంతటా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలంటూ నిరసన తెలుపుతున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లను సచివాలయ ముట్టడికి యత్నించారు. రాష్ట్ర నలుమూలల నుంచి నగరానికి వచ్చిన బెటాలియన్ కానిస్టేబుళ్లు సోమవారం ఉదయం సచివాలయం వద్దకు బయలుదేరారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ వస్తున్న వారిని ఎన్టీఆర్ స్టేడియం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ కానిస్టేబుళ్లు తమ ఆవేదనను వెళ్లగక్కారు. సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ జితేందర్ తమను పిలిచి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డే ఏక్ పోలీస్‌చేస్తానని వందసార్లు చెప్పాడని ఓ బెటాలియన్ కానిస్టేబుల్ గుర్తుచేశారు. కానీ ఇప్పుడు తమను కనీసం కలవడం లేదని అన్నారు. ఒక రివ్యూ మీటింగ్ పెట్టి మా సమస్యను తీర్చే సమయం కూడా లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. పాలన చేతగాక అన్ని వ్యవస్థలను నాశనం చేస్తూ.. న్యాయం చేయాలని అడిగిన వారిని అరెస్టులు చేయించడమేనా ప్రజా పాలన అని నిలదీశారు. తమ సమస్యలను తీర్చాలని బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యులు కొద్దిరోజులుగా చేస్తున్న ఆందోళనలు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నాయి. అయినప్పటికీ రాష్ట్ర




ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే శనివారం భార్యాపిల్లలతో రోడెక్కిన కానిస్టేబుళ్లపై తెలంగాణ పోలీసు శాఖ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెటాలియన్లలో ఒకే రోజు 39 మందిని సస్పెన్షన్ చేస్తూ అర్ధరాత్రి వేళ ఉత్తర్వులు ఇచ్చింది. తమ సహోద్యోగులు సస్పెన్షన్ గురికావడంతో వారికి బెటాలియన్ కానిస్టేబుళ్లంతా బాసటగా నిలిచారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలని బెటాలియన్ల ముట్టడి చేపట్టారు. గంటలకొద్దీ బెటాలియన్ ముఖద్వారం వద్ద నిరసన చేపట్టినా.. కమాండెంట్ పట్టించుకోకపోవడంతో పట్టరాని కోపంతో రోడెక్కారు. అనంతరం రాత్రి వేళ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అయినప్పటికీ

..మిగతా 2లో



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చిన్న పత్రికల అసోసియేషన్

# చిన్న పత్రికల సమస్యలు పరిష్కరిస్తా

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం) సమాచార పౌర సంబంధాల శాఖ, రెవిన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. సోమవారం సెక్రటేరియట్ లోని మంత్రి ఛాంబర్ లో యూనియన్ నేతలు పలువురు కలిసి బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తేగా ఆయా అంశాల పరిష్కారానికి యూనియన్ నేతలతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాతాకుల అశోక్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు, జర్నలిస్ట్ యాంటి అటాక్స్ కమిటి సభ్యులు దాస్ మాతంగి, సీనియర్ పాత్రికేయులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి ,బొమ్మపాల వెంకటయ్య, జాన్ షహీద్ , శ్రీనివాస్ ,అహ్మద్ అలీ ,చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌లు, ఐఎఫ్ఎస్‌ల బదిలీ

2

## చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి పూజలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్ట్ శశికళ

చార్మినార్, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం) చారిత్రాత్మక చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి లో జరగనున్న దీపావళి ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డిని ఆలయ ట్రస్ట్ శశికళ ఆహ్వానించారు. దీపావళి సందర్భంగా ఆలయం లో ఈ నెల 29,30,31 తేదీలలో జరగనున్న లక్ష్మి పూజలలో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డికి చార్మి నార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ, సూర్యప్రకాశ్ లు ఆహ్వాన పత్రిక అందజేశారు.



## కాళేశ్వరం డిపిఆర్‌కు

# కేసీఆర్ ఆమోదం

### విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం): కాళేశ్వరం డీపీఆర్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విచారణ సందర్భంగా విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంకటేశ్వర్లు కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది. ఇందుకు సంబంధించిన దస్త్రాలను కమిషన్‌కు అందించారు. కాళేశ్వరం డిజైన్లనునైల్ చేయమని కేసీఆర్ చెప్పినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మినిట్స్‌కు సంబంధించిన దస్త్రాలు, మూడు బ్యారేజీల వివరాలను సమర్పించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి అప్పటి ప్రభుత్వాధినేత ఆదేశించారని వెంకటేశ్వర్లు బదులిచ్చినట్లు సమాచారం.

# రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా సి నారాయణరెడ్డి

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సి.నారాయణ రెడ్డి




రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణరెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం) రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా సి.నారాయణ రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న నూతన జిల్లా పాలనాధికారికి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్ కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. కొత్త కలెక్టర్ కు అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, కలెక్టరేట్ ఏ.ఓ సునీల్, కలెక్టర్ కు పూల బొకేలు అందించి స్వాగతం పలికారు.

## ఏఎన్నార్ జాతీయ పురస్కారం అందుకున్న చిరంజీవి



2



## మంత్రి పొంగులేటికి సిఎం రేవంత్ శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్బంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు సీఎం తెలిపారు. అలాగే పలువురు మంత్రులు, తోటి ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు శభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టారు.

# ఏఎన్నార్ జాతీయ పురస్కారం అందుకున్న చిరంజీవి

మొదటి పేజీ తరువాయి...

అన్నపూర్ణ స్టూడియోలో 2024కి గాను ఏఎన్నార్ జాతీయ పురస్కారాల వేడుకల కార్యక్రమం ఘనంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవిని శాలువాతో సత్కరించి.. అక్కినేని జాతీయ అవార్డు ప్రదానం చేశారు అమితాబ్ బచ్చన్. ఈవెంట్‌లో అక్కినేని హీరోలతోపాటు చిరంజీవి తల్లి అంజనా దేవి, దర్శకేంద్రుడు కే రాఘవేంద్రరావు, త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వినీదత్, యాక్టర్లు వెంకటేశ్, నాని, రాంచరణ్, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం, ఎంఎం కీరవాణితోపాటు పలువురు సెలబ్రిటీలు పాల్గొన్నారు.

**ఈ అవార్డుతో జీవితానికి పరిపూర్ణత**

సినీరంగంలో తాను రచ్చ గెలిచి ఇంట గెలిచానని వ్యాఖ్యానించారు అగ్ర నటుడు చిరంజీవి. ఏఎన్నార్ నేషనల్ అవార్డును అందుకోవడంతో తాను ఇంట గెలిచానని గర్వంగా ఉందన్నారు. వజ్రోత్సవాల సందర్భంగా తనకు జరిగిన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకొని చిరంజీవి భావోద్వేగానికి గురయ్యారు. సోమవారం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో నిర్వహించిన వేడుకలో 'అక్కినేని నాగేశ్వరరావు జాతీయ అవార్డు'ను ఆయన అందుకున్నారు. 2024 సంవత్సరానికి గానూ ఈ అవార్డును ప్రదానం చేశారు. అమితాబ్‌బచ్చన్ చేతుల మీదుగా చిరంజీవి పురస్కారాన్ని స్వీకరించారు.

**చిరంజీవి ఏది అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు: అమితాబ్**

చిరంజీవి, నాగార్జున, నాగ్‌అశ్విన్ వంటి వారు నన్ను తెలుగు సినిమాల్లో భాగం చేశారు. తెలుగు ఇండస్ట్రీలో నేను కూడా ఓ సభ్యుడినేనని గర్వంగా చెప్పుకుంటా. తెలుగు చిత్రసీమలో నన్నూ ఓ భాగంగా పరిగణించండి. ఇండియన్ సినిమాకు నాగేశ్వరరావుగారు చేసిన సేవలు అనితరసాధ్యం. ఇక చిరంజీవి నేను ఎప్పుడు ఏది అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు. చిరంజీవి ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు.

**రచ్చ గెలిచి ఇంట గెలిచాను: చిరంజీవి**

అమితాబ్‌బచ్చన్ నాకు గురువు, స్ఫూర్తిప్రదాత. నాకు ఏ అవార్డు వచ్చినా తొలుత ఆయన నుంచే శుభాకాంక్షలు అందుతాయి. పద్మభూషణ్ అవార్డు వచ్చినప్పుడు జరిగిన సన్మాన కార్యక్రమంలో అమితాబ్‌గారు 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా' అని చెప్పడం నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆయన మాటలు నాకు స్ఫూర్తినిచ్చాయి. అమితాబ్‌బచ్చన్‌గారితో గడిపిన ప్రతి క్షణం విలువైనది. ఇండియన్ సినిమాకు బాద్‌షా, షెహన్‌షా అయిన అమితాబ్ నుంచి ఈ అవార్డు స్వీకరించడం గర్వంగా ఉంది. తెలుగులో ఇంట గెలిచి రచ్చ గెలవాలి అనే ఓ నానుడి ఉంది. నా విషయంలో రచ్చ గెలిచి ఇంట గెలిచానని అనిపిస్తోంది. నేను ఇంట గెలిచే అవకాశం తెలుగు సినిమా వజ్రోత్సవాల సమయంలో వచ్చింది. నాకు అప్పుడు లెజెండరీ పురస్కారం ప్రదానం చేశారు. అప్పుడు ఎంతో ఆనందపడి ధన్యుణ్ణి అనుకున్నా. కానీ కొన్ని ప్రతికూల పరిస్థితుల వల్ల, కొందరు వ్యక్తులు హర్షించని కారణంగా ఆ పురస్కారాన్ని తీసుకోవడం సముచితం అనిపించలేదు. అందుకే ఆ రోజు అవార్డుని ఓ క్యాప్సుల్ బాక్స్‌లో పడేసి నాకు అర్హత ఎప్పుడు వస్తుందో అప్పుడే తీసుకుంటానని చెప్పాను. ఆ రోజు నేను ఇంట గెలవలేదు. ఈ రోజు ది గ్రేట్ ఏఎన్నార్ అవార్డును ది గ్రేట్ అమితాబ్‌బచ్చన్‌గారి చేతుల మీదుగా అందుకున్నా. ఇప్పుడు నేను ఇంట గెలిచాను.. రచ్చగెలిచాను అనిపిస్తోంది. ఈ పురస్కార ప్రదానం గురించి చెప్పడానికి నాగార్జున, వెంకట్ ఇంటికి వచ్చినప్పుడు చాలా ఆనందించాను. నాకు పద్మభూషణ్, పద్మవిభూషణ్, గిన్నిస్‌బుక్‌లో స్థానం వచ్చినా ఈ అవార్డు విషయంలో నా భావోద్వేగం వేరుగా ఉంది. నావాళ్లు నన్ను గుర్తించి అవార్డు ఇస్తుండటం నాకు గొప్ప విషయంగా అనిపించింది. ఇది నాకు అన్ని పురస్కారాలకు మించిన ప్రత్యేకమైన అవార్డు అని నాగార్జునతో చెప్పాను. ఈ వేడుకలో మా అమ్మని ముందు సీటులో కూర్చొబెట్టడానికి ప్రధాన కారణం..అమ్మ నాగేశ్వరరావుగారికి వీరాభిమాని. అక్కినేని నాగేశ్వరరావుగారితో కలిసి 'మెకానిక్ అల్లుడు' చిత్రంలో నటించినప్పుడు ఎన్నో మంచి విషయాలు నేర్చుకున్నా. సెట్‌లో ఆయన్ని చూస్తే నడిచే ఎన్‌సైక్లోపీడియా అనిపించేది. ఆయన నాకు పితృసమానులు. ఈ విషయం ఎక్కడా చెప్పే అవకాశం రాలేదు. అందుకే ఇక్కడ చెబుతున్నా. దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, కె.బాలచందర్ వంటి లెజెండ్స్‌కు దక్కిన ఈ పురస్కారం నాకు దక్కడ పూర్వ జన్మ సుకృతం. ఈ అవార్డు నా జీవితానికి పరిపూర్ణతనిచ్చింది. ఈ రోజుని జీవితాంతం గుర్తుంచుకుంటాను. నాగార్జున నాకు భగవంతుడు ఇచ్చిన అద్భుతమైన స్నేహితుడు. నాకు ఆహారం, ఆరోగ్యం విషయంలో ఎప్పుడూ సలహాలిస్తుంటాడు. ఆయన ఏం చెప్పినా ఫాలో అయిపోతుంటాను. అక్కినేని కుటుంబం మొత్తం మా కుటుంబ సభ్యుల్లాంటివారే. వారు చూపించే ప్రేమను నేను జీవితాంతం పదిలపరచుకుంటాను.



## 21వ అఖిల భారత పశుగణన గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం)సోమవారం ఐ.డి.ఓ.సి సమావేశం హాల్ నందు పశు సంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన పశుగణన కార్యక్రమ గోడప్రతులను జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణన-తెలంగాణ సర్వే కార్యక్రమం జిల్లాలో ఈ నెల 25 నుండి ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగుతుందని అన్నారు.ఈ ప్రక్రియలో ఆవులు, గేదెలు, గొర్రెలు,కోళ్ళు, మేకలు,ఇతర జంతువుల సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో మొబైల్ అనువర్తనం ద్వారా నిక్షిప్తంగా చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 12 మండలాలకి గాను ఒక నోడల్ ఆఫీసర్,12 మంది సూపర్వైసర్లు, 44 మంది ఎన్యుమేరేటర్లు కలిసి జిల్లాలోని ప్రతి నివాస గృహాన్ని సందర్శించి పశుఘనణ వివరాలు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. వివరాల సేకరణలో ప్రజా ప్రతినిధులు, పాడి రైతులు, పశు పోషకులు, గొర్లకాపర్లు ప్రతి ఒక్కరు సహకరించి కచితమైన సమాచారాన్ని అందించాలన్నారు. పశు గణన వివరాల ద్వారా మాంసం గుడ్డు, పాల ఉత్పతులు గుణించి పశు సమవర్ధక రంగాబివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు చేసుకోడానికి తోడ్పడుతుందని అన్నారు. తద్వారా భారత దేశ స్థూల జాతీయ ఉత్పత్తి పెంచడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్ డి ఓ రామచందర్, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మత్స శాఖ అధికారి షకీలా భాను, ఆర్డబ్ల్యూఎస్ ఏ. ఈ శ్రీధర్ రెడ్డి, వైద్యులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దమ్ముంటే రాజీనామా చేసి పోటీ చేసి గెలువు, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్

**తెలంగాణ ద్రోహి మాధవరం కృష్ణారావు**

**95 శాతం అభివృద్ధి చేశాను అంటున్నావు నీ ఇంట్లో నుంచి తెచ్చావా!!**

**బిజెపి, కాంగ్రెస్ ఒక్కటైతే సీఎం రేవంత్ రెడ్డి బిజెపిని ఎందుకు తిడతాడు..**

**పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బిజెపికి వేయించింది నిజం కాదా!**

**హైడ్రా ముసుగులో బిఆర్ఎస్ హై డ్రామా.**

**కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి.**



కూకట్‌పల్లి,అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం)కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నీకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో గెలవాలని కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెరువుల అభివృద్ధి పేరుతో చెరువు స్థలాలను మాయం చేసి, అక్రమంగా సంపాదించింది నిజం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ లోకి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభివృద్ధి పేరుతో వస్తే రాజీనామా చేయాలని సవాల్ విసురుతున్నావు కదా. గతంలో నీకు టిడిపి వాళ్ళు ఓట్లు వేసి గెలిపిస్తే నువ్వు కూడా అభివృద్ధి పేరుతోనే కదా టిఆర్ఎస్ పార్టీలోకి పోయావు అప్పుడు నువ్వు రాజీనామా చేసావా అసలు నీకు దమ్ముంటే గత ఎన్నికల్లో 95 శాతం అభివృద్ధి జరిగిందని ఎన్నికల్లో కెళ్ళి ప్రజలు నిన్ను నమ్మి గెలిపించారు...!!! సరే అదే మాట ఇప్పుడు చెప్పి రాజీనామా చేసి ఇప్పుడు ఎన్నికల్లోకి రా!!! ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్ చేశారు. అసలు నువ్వు నమ్ముకున్న పార్టీకి మోసం చేసి టిఆర్ఎస్ లో చేరలేవా? ఇది ప్రజలకు తెలియదా? అని అన్నారు. అభివృద్ధికి విఘాతం కలిగిస్తూ కాంగ్రెస్ పార్టీని విమర్శలు చేస్తే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు భవిష్యత్తులో రాజకీయ పుట్టగతలే ఉండవని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, బిఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టించి ఉద్యమకారులను అణిచివేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బిజెపి కాంగ్రెస్ ఒకటేనని మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గత పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కేడర్ తో బిజెపికి పని చేయించి ఓట్లు వేసి టిఆర్ఎస్ అభ్యర్థికి మోసం చేసింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఎవరు ఏ విధంగా రాజకీయాల్లో రాణిస్తారో కాలమే నిర్ణయిస్తుంది ఇది ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గమనించాలన్నారు.



## టాటా-ఎయిర్‌బస్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

**స్పెయిన్ ప్రధానితో రోడ్ షో**

**లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీ**

గాంధీనగర్, న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఇద్దరూ కలిసి సోమవారం గుజరాత్‌లోని వడోదరలో టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ఇద్దరూ కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ రోజు (సోమవారం) ఇరుదేశాధి నేతలు చారిత్రాత్మకమైన లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీలో పాల్గొననున్నారు. కాగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు చెందిన ఈ ఫెసిలిటీని సైనిక విమానాల తయారీ కోసం ఉపయోగిస్తారు. మన దేశంలో మొట్టమొదటి ప్రైవేటురంగ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఇదే కావడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా ఈ ఫెసిలిటీలో మొత్తం 40 విమానాలను తయారు చేస్తారు. ఏవియేషన్ దిగ్గజ కంపెనీ 'ఎయిర్‌బస్' నేరుగా 16 విమానాలను భారత్‌కు అందించనుంది. టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ ప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. సైనిక విమానాల తయారీ కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ రంగ ప్లాంట్ ఇదేనని తెలిపింది. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భారత్‌లో 40 విమానాలను తయారు చేసే బాధ్యతలు తీసుకుంటుంది. ఈ ఫెసిలిటీ దేశంలోనే తొలి ప్రైవేట్ సెక్టార్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌గా నిలిచింది. తయారీ నుంచి అమరిక వరకు సమస్త వ్యవస్థ ఇక్కడే ఉంటుంది. విమానాలను టెస్టింగ్ చేయడం నుంచి డెలివరీకి అవసరమైన అర్హత ప్రమాణాలను కూడా ఇక్కడే నిర్వహిస్తారు" అని పేర్కొంది. కాగా టాటా కంపెనీలతోపాటు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు కూడా తమ సహకారాన్ని అందించనున్నాయి. కాగా వడోదరలో ఏర్పాటు చేసిన ఫైనల్ అసెంబ్లీ లైన్‌కు అక్టోబర్ 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యి అందుబాటులోకి రావడంతో ఇవాళ ప్రారంభించారు.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌లు, ఐఎఫ్ఎస్‌ల బదిలీ

హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం): తెలంగాణలో 13 మంది ఐఏఎస్‌లు, 3 ఐఎఫ్ఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా త్రిపాఠి, రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణ రెడ్డి, యాదాద్రి కలెక్టర్‌గా హనుమంత రావు, మున్సిపల్ శాఖ డైరెక్టర్‌గా టీకే శ్రీదేవి, సీసీఎల్ఏ డైరెక్టర్‌గా మందా మకరందు, ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా ఎస్. హరీష్, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా దిలీప్ కుమార్, టూరిజం డైరెక్టర్‌గా జెడ్‌కే. హనుమంతు, ఆర్ అండ్ ఆర్, భూసేకరణ కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శిగా ఆయేషా మస్రత్ ఖన్నం, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తి, డెయిరీ కార్పొరేషన్ ఎండీగా చంద్రశేఖర్ రెడ్డి, క్రీడాశాఖ డైరెక్టర్‌గా సోని బాలాదేవీ, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీగా కొర్రా లక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఎండీగా ఎన్. క్షితిజ, జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అదనపు కమిషనర్‌గా సుభద్రాదేవీ, వికారాబాద్ డీఎఫ్‌గా జి.జ్ఞానేశ్వర్‌లకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆగని బెటాలియన్ పోలీసుల నిరసన

మొదటి పేజీ తరువాయి...

సర్కారులో చలనం రాకపోవడంతో ఉద్యమ కార్యాచరణ ప్రకారం సోమవారం సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. బెటాలియన్ కానిస్టేబుళ్లు సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సెక్రటేరియట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. సచివాలయం చుట్టూ భారీగా పోలీసులను మోహరించారు. పరిపాలన సౌధం చుట్టూ 163 సెక్షన్ విధించారు. సెక్రటేరియట్ పార్కింగ్ గ్రౌండ్‌లో సుమారు 200 మంది సిబ్బందిని మోహరించారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద పోలీసు వాహనాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. కాగా, వీడియోలు తీయడానికి మీడియాకు అనుమతి లేదని పోలీసులు చెబుతున్నారు.




## శ్రీ ధన్వంతరి స్వామీ విగ్రహ ప్రతిష్ట స్వామీ వారి సామూహిక కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణా రావు, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

కూకట్‌పల్లి,అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ శ్రీ సాయి నాగేంద్ర ఆలయంలో శ్రీ ధన్వంతరి స్వామీ వారి విగ్రహ ప్రతిష్ట స్వామీ వారి సామూహిక కళ్యాణం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంబటి సునీల్, దేవాలయ నిర్మాణం విగ్రహ దాత పి.త్రికోటేశ్వర రావు తోపాటు నాయకులు మందడి సుధాకర్ రెడ్డి,బొట్టు విష్ణు, దేవులపల్లి కృష్ణామూర్తి, వెంకటేశ్వర్లు, రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, బాజని నాగేందర్ గౌడ్,ప్రేమ్ కుమార్, యం.సుధాకర్, భక్తులు పాల్గొన్నారు .



## భిక్షాటన చేస్తున్న వృద్ధ మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణి చేసిన యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్

కూకట్‌పల్లి,అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం)శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఉంటూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధ మహిళలకు హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ వారి సహకారంతో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ చేతులమీదుగా నిత్యావసర సరుకులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి తమ డివిజన్ లోని పేద ప్రజలకు సేవ చేస్తున్న హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు ఆలేఖ్యకు వారి బృందానికి కృతజ్ఞతలు తెలియచేసారు. రానున్న రోజుల్లో కూడా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని సంస్థ వారిని కోరారు. కార్యక్రమంలో భారత్ గౌడ్, నరసింహులు, మల్లీశ్వరి, వెంకటేశ్వరరావు, రవి కిరణ్, అమూల్య, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న అబ్దుల్ నబీ

## ఉమ్మడి జిల్లా ఉషూ ఉపాధ్యక్షులుగా మాస్టర్ అబ్దుల్ నబీ

మహబూబ్ నగర్, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం)ఉమ్మడి జిల్లా ఉషూ ఉపాధ్యక్షులుగా మాస్టర్ అబ్దుల్ నబీ ఎన్నికయ్యారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా నూతన ఉషూ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ , పరిశీలకులు ఇమ్రాన్, రాష్ట్ర ట్రెజరర్ ఎస్ పరమేష్, బాలరాజ్, చిన్న వీరయ్య ల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి వూషూ అసోసియేషన్ ఎంపిక జరిగింది. వైస్ ప్రెసిడెంట్ గా అబ్దుల్ నబీ లను ఎన్నుకున్నారు .ఈ సందర్భంగా మాస్టర్ మాట్లాడుతూ ... జిల్లాలో వూషూ ప్రతి విద్యార్థినికి నేర్పించి వారిని జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో పథకాలు సాధించే విధంగా కృషి చేస్తానన్నారు. నాకు సహకరించిన నా విజయానికి తోడ్పడిన నా గురువు మాస్టర్ జాంగిర్ పాషా ఖాద్రి, ఉమ్మడి జిల్లా ఆల్ మాస్టర్స్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే అకాడమీ మాస్టర్స్ ఎంఎ ఇఫ్తార్ రఫ్ యుల్లా ఖాద్రీ, వెంకటేష్ ,జి హరీష్ యాదవ్, జాఫర్, సాదిక్ ,జి పరమేష్ , ఎండి ఇంతియాజ్, బి కురుమూర్తి యాదవ్, అరవింద చారి మంజునాథ్, జే సుమ, అనిత ,ఎండి జాంగిర్, పృథ్వీరాజ్ పలువురు మాస్టర్ ని అభినందించారు.



## అనారోగ్యానికి గురైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డిని పరామర్శించిన బండి రమేష్

కూకట్‌పల్లి,అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం) కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పరామర్శించారు. పుష్పరెడ్డికి ఇటీవల అనారోగ్యానికి గురై మోకాళ్ళకు ఇటీవలే శస్త్ర చికిత్స చేయించుకున్నారు. బండి రమేష్ బాల నగర్ లోని ఆమె నివాసంలో సోమవారం కలిసి పరామర్శించారు త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమంలో యధావిధిగా చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, దినేష్ కుమార్, శ్రీకాంత్ పటేల్, యుగంధర్ ,అస్లాం, అరుణ్, నయీమ్ , కిట్టు, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ నూనె గింజల పరిశోధనల సమీక్షా సమావేశం



నూనె గింజల సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ టి కె శర్మ



సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు

బుద్వేల్, అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ నూనె గింజల పరిశోధనల సమీక్ష, ప్రణాళికల రూపకల్పనకు ఉద్దేశించిన రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం వాటర్ టెక్నాలజీ సెంటర్ లో ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కుసుమ, అవిసెల పంటలపై పరిశోధనలు చేస్తున్న 150 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. వివిధ పరిశోధన అంశాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై కూలంకుషంగా చర్చించారు. ఈ కార్యక్రమంను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం , జాతీయ నూనె గింజల పరిశోధన సంస (ఐ ఐ ఓ ఆర్) లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి . ఈ కార్యక్రమానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐ సీ ఏ ఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. టి. ఆర్. శర్మ అధ్యక్షత వహించారు . ప్రస్తుతం ఇండియా రూ . 1.7 లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి నూనెలని దిగుబడి చేసుకుంటున్నదని, దీని తగ్గించడానికి జాతీయ నూనె గింజల మిషన్ ని భారత ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మనం చేసే పరిశోధనలు నూనె గింజ పంటల సాగును పెంచి, రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. ముళ్ళు లేని కుసుమ రకాలను వృద్ధి చేయాలన్నారు. అన్ని పరిశోధన సంస్థలు సంయుక్తంగా పరిశోధనలు చేయడం వల్ల కుసుమ, అవిసెలలో చాలా నూతన రకాలను వృద్ధి చేయడం జరిగిందని శర్మ వివరించారు. ఐ సి ఏ ఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజీవ్ గుప్త మాట్లాడుతూ, చాలా ప్రాంతాలలో కుసుమ, అవిసె పంటలకు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ముఖ్యంగా ఈ నూనె గింజల పంటలలో లైనోలేనిక్ ఆసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. కానీ ఈ పంటల సాగు ఇంకా పెంచి రైతులకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. వాచింతనగర్ లోని జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డా.మాథూర్ గత సంవత్సరం కుసుమ, అవిసెలలో చేపట్టిన పరిశోదన ఫలితాలను క్లుప్తంగా వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డా. జెల్లా సత్య నారాయణ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం చాలా వరకు కుసుమ సాగును ప్రోత్సహిస్తూ రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం ను అందిస్తుందన్నారు. విశ్వ విద్యాలయం చీడ పీడలను తట్టుకునే రకాలను వృద్ధి చేయడమే కాకుండా కుసుమ నూనె కూడా ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుసుమ, అవిసెలు సాగు చేస్తున్న రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కు చెందిన ప్రధాన శాస్త్రవేత్త డా. సి. సుధాకర్ సమన్వయ కర్తగా వ్యవహరించి ప్రారంభ సమావేశంలో ముగింపు ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రతినిధులు, ప్రధాన శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాల కు చెందిన 150 మంది శాస్త్రవేత్తలు, విద్యార్థులు మరియు రైతులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను కలిసి అభినందిస్తున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

## వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతిని కలిసిన విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి

బుద్వేల్, అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం): తెలంగాణా రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యని మర్యాదపూర్వకం గా కలిసారు. ఉదయం రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం లోని ఉపకులపతి కార్యాలయంలో వీరి భేటీ జరిగింది.రాష్ట్రం లోని విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలపైన వీరిరువురూ చర్చలు జరిపారు.

**విశ్వవిద్యాలయం లో విజిలెన్స్ అవేర్ నెస్ వీక్. :**

విజిలెన్స్ అవేర్ నెస్ వారోత్సవాలలో భాగం గా సోమవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం లో అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేసారు.ఉపకులపతి ఆల్దాస్ జానయ్య ఆధ్వర్యం లో బోధన,బోధనేతర సిబ్బంది,ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఈ అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేసారు.



నామినేషన్ వేయడానికి వెళ్తున్న అభ్యర్థి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

## మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం: ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, అక్టోబర్28(ప్రభాత ఉదయం) మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జిఎంఆర్ అన్నారు. సోమవారం మహారాష్ట్ర ఎన్నికల్లో భాగంగా ముంబై నగరంలోని మలద్ వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అస్లాం షేక్ నామినేషన్ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అభ్యర్థి అస్లాం షేక్ నామినేషన్ ఊరేగింపులో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## సెట్విన్ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది

### రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

యాకుత్ పూర, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ సంస్థను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అధునాతన వసతులతో రూపొందించిన సంస్థ చైర్మన్ కార్యాలయాన్ని చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వాటి పురోగతి ఇతర అంశాలను చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావు కలిసి సమీక్షించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... సంస్థ నిర్వహిస్తున్న శిక్షణ, ట్రాన్స్ పోర్ట్, ట్రేడింగ్ ద్వారా ఆదాయాన్ని సమకూర్చే విధంగా తన వంతు సహకారం తప్ప ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతి యువకుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వరంగ సంస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.జంట నగరాల్లోని నిరుద్యోగులకు శిక్షణ అందించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 1978సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నా రెడ్డి ఒక మంచి ఆశయంతో సెట్విన్ సంస్థను స్థాపించడం జరిగిందన్నారు. ఎంతో గొప్ప ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు.ముఖ్యంగా జంట నగరాలతో పాటు సెట్విన్ మినీ బస్సు సర్వీసులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించే కార్యక్రమానికి తన శాఖ పరంగా అన్ని విధాలుగా సహకారం ఉంటుందన్నారు. ఎలక్ట్రిక్ ఈ ఆటో సేవలను సెట్విన్ ద్వారా అందించడంతో పాటు మహిళకు ఉపాధి అవకాశాలను కల్పనకు సహకరిస్తానని అన్నారు. సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ కేవలం జంట నగరాలకే పరిమితం కాకుండా తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలకు విస్తరింపచేసే సందర్భంలో త్వరలోనే జహీరాబాద్, జెడ్చర్ల, హుస్నాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ ప్రాంతాలలో సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. రాబోయే 'రెండు సంవత్సరాలలో 50 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసే లక్ష్యంగా ముందుకు సాగుతామని, ప్రతి ఏటా కనీసం 25 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ అందించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో మేము పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ సురేష్ బాబు, మేనేజర్ అబ్దుల్ మొయిజ్, సెట్విన్ సిబ్బంది పాల్గొన్నారు.



తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

## ఉపాధ్యాయులకు నాలుగు డిఏలు, పిఆర్సీ వెంటనే అమలు చేయాలి

బుద్వేల్, అక్టోబర్ 28 ( ప్రభాత ఉదయం): ఉపాధ్యాయులకు రావలసిన నాలుగు డీఏలతోపాటు పిఆర్సీ ని వెంటనే ప్రకటించాలని కోరుతూ సోమవారం టీయూపీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు తహసిల్దార్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యారంగ సమస్యలను వివరించారు . ప్రభుత్వం యొక్క ఉదాశీనతను తొలగించుకొని , ఎలక్షన్లకు ముందు ప్రకటించిన విధంగా ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఆర్థికపర అంశాలైన ఉపాధ్యాయుల యొక్క పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కొరారు. 4 డీఏలు వెంబడే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటి నివేదికను వేగవంతం చేసి, త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, లేని యెడల సెప్టెంబర్ 23 న మహా ధర్నాకు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో టియుపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంత్ రావు , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఖాశీ రావు, మండల భాద్యులు ఏం బాలకృష్ణ, అనిల్ , బాలకృష్ణ, టియుపిఎస్ సంఘ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## ఇది కర్ఫ్యూ కాదు.. దీపావళి పండుగకు ఎలాంటి ఆంక్షలు లేవు

హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ నగరంలో నెల రోజుల పాటు పోలీస్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు చేశారు. నగరంలో అశాంతిని సృష్టించడానికి పలు సంస్థలు, పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 163 ప్రకారం ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలపై నిషేదం విధిస్తున్నట్లు వెల్లడించారు. ఐదుగురికి మించి గుమికూడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నవంబర్ 28వరకు వరకు నెలరోజుల పాటు ఆంక్షలు అమలులో ఉంటాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తాజాగా మరో ఎక్స్ వేదికగా మరో ప్రకటన విడుదల చేశారు. "ఈ ఆంక్షలకు దీపావళి పండుగ వేడుకలకు ఎలాంటి సంబంధం లేదు. అనేక రకాల ఆందోళనలు, సచివాలయం, సీఎం నివాసం, డీజీపీ కార్యాలయం, రాజ్‌భవన్ మొదలైన వాటిపై ఆకస్మిక దాడులకు కొన్ని గ్రూప్లు ప్లాన్ చేస్తున్నాయి. ఈ అంశంపై మాకు ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందింది. అలాంటి వారిని అరెస్టు చేయడంలో పోలీసు చర్యకు చట్టపరమైన మద్దతునిచ్చేలా ఈ నోటిఫికేషన్ ఇవ్వబడింది.



చిన్న శంకరంపేట లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రోహిత్

## ముత్యాలమ్మ ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

మెదక్, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం) ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఆకాంక్షించారు. సోమవారం చిన్న శంకరం పేట మండలం కామరం గ్రామం లోని ముత్యాలమ్మ అమ్మవారికి బోనాల పండుగ ఉత్సవాలలో ఎమ్మెల్యే రోహిత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ... మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే విధంగా ఆనవాయితిగా వచ్చే పండుగలను ఘనంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి : చంద్రమోహన్

బుద్వేల్, అక్టోబరు 28(ప్రభాత ఉదయం): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ఆన్ లైన్ సేవలు కార్మికులకు అందుబాటు లోకి తెవాలని తెలంగాణ బిల్డింగ్, ఆదర్ కంస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కాటేదాన్ లోని సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు సమావేశమయ్యారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు, పెండింగ్ కేసుల డబ్బులు విడుదల చేయాలని కోరారు. ఆన్ లైన్ సేవలు గత నాలుగు నెలలుగా రావటం లేదని బేనిఫిషర్స్ అంతరాయాన్ని తోలగించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించాలన్నారు . గత ప్రభుత్వం ఇస్తానన్న మోటార్ సైకిళ్ళు ఈ ప్రభుత్వం ఇవ్వాలన్నారు. కార్మిక శాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. వలస కార్మికుల చట్టం అమలుచేయాలన్నారు . కార్మిక శాఖ అధికారులు కార్మికుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఎల్ఐసి కంపెనీలకు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలన్నారు. .కార్మకులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేసారు . నిత్యావసర సరుకుల అధిక ధరలు తగ్గించాలని, పెట్రోల్, డిజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజా కార్మిక సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందారని మండిపడ్డారు.. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సిఐటియు కార్యదర్శి చంద్రమోహన్, రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు పెంద్యాల బ్రహ్మయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిఎం, కురమయ్య, సుంకర రాంమోహన్, లు డిమాండ్ చేశారు.. ఈకార్యక్రమంలో చైతన్య, పార్వతి,ముస్తాఫ, సంతోష్ కూమార్, శంకర్, చంద్రయ్య, నవీన్, సైదులు, లక్ష్మయ్య, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.




కాటేదాన్ సిఐటియు కార్యాలయంలో సమావేశమైన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

# జీహెచ్ఎంసీలో పెండింగ్‌లో ఉన్న నాలలు,ఫ్లై ఓవర్‌ల నిర్మాణం వేగవంతం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**ఎక్కడెక్కడ కొత్త నాళాలు ,ఫ్లై ఓవర్లు అవసరమో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలి.**
**90 రోజుల వాటర్ హార్వెస్టింగ్ ప్రోగ్రాంలో భాగంగా పెద్ద పెద్ద బిల్డింగ్‌లు , అపార్ట్మెంట్ లలో ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాలి.**
**141 లాగింగ్ పాయింట్స్ లో ప్రధానంగా ఇబ్బందులు ఉన్న 23 సంపులలో పనులు వేగవంతం చేయాలి**
**వచ్చే వర్షాకాలం లోపు ప్లాన్ ఆఫ్ యాక్షన్ కింద నగరంలో వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉండకుండా చర్యలు తీసుకోవాలి**

హైదరాబాద్, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం) హైదరాబాద్ విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఎస్ఆర్డీపి, ఎస్ఎన్డీపీలో ప్రాజెక్ట్ భాగంగా చేపట్టిన ఫ్లై ఓవర్లు , నాళాల నిర్మాణాలు పై జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్లు ,ఇతర ఉన్నతాధికారులతో సచివాలయం లోని తన ఛాంబర్ లో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ నుండి ప్రజల ఇబ్బంది లను తగ్గించడానికి నగరంలో ఎస్ఆర్డీపి లో భాగంగా 48 ఫ్లై ఓవర్ లను ప్రారంభించింది. ఈ ఫ్లైల ఓవర్ ద్వారా ట్రాఫిక్ సిగ్నల్ అవైడ్ చేయడానికి , సమయాన్ని , ఫ్యుయల్ ను అదా చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎస్ఆర్డిపి వర్క్స్ లో భాగంగా జీహెచ్ఎంసీ కి సంబంధించి 42 వర్క్ కాగా 6 ఫ్లై ఓవర్ లు ఆర్ అండ్ బి ,హెచ్ఎండీఏ కి చెందినవి అందులో ఇప్పటికే 36 పనులు పూర్తయ్యాయని చీఫ్ ఇంజనీర్ అధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్ హెచ్ లో భాగంగా నిర్మిస్తున్న అంబర్ పేట ఫ్లై ఓవర్, ఉప్పల్–నారపల్లి నిర్మాణం కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే పెండింగ్ లో ఉన్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు వేగవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అరంఘర్ వయ శాస్త్రిపురం మధ్య నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు చివరి దశలో ఉండడంతో డిసెంబర్ లోపు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఎన్డీపీ లో భాగంగా నగరంలో నాళాల ద్వారా మురుగు నీటి వ్యవస్థ తదితర అంశాలపై సమీక్షా సమావేశంలో చర్చించారు.పెండింగ్ లో ఉన్న నాళాల పై ఆరా తీశారు. వచ్చే వర్షాకాలం సీజన్ లోపు వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఫ్లై ఓవర్ లు ,కొత్త నాళాలు అవసరమైన చోట ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ లో మాత్రమే కాకుండా పరిసర ప్రాంత మున్సిపాలిటీ లలో బడంగ్ పేట్ , జల్పల్లి,మీర్పేట్ తదితర కోర్డినేట్ చేసుకొని పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. రైల్వే డిపార్ట్మెంట్ కడుతున్న అండర్ పాస్ లు తదితర పనులు సి ఎస్ పి డి సి ఎల్11%ఎజ /33ఎజ% పనులపై విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.సీఆర్ఎంపి రోడ్ల లో భాగంగా జీబ్రా క్రాసింగ్ లైన్ సైనెడ్ బోర్డులు ఇతర రోడ్డు మార్కింగ్ లు ఎక్కడైనా పెండింగ్ పనులు ఉంటే పూర్తి చెల్లించాలని కొత్త రోడ్లు అవసరం ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం నగరంలో 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ ద్వారా ప్రజలు



తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 50 స్ట్రక్చర్స్ నిర్మించాల్సి ఉన్నప్పటికీ మొదటిదశ చేపట్టిన రైన్ వాటర్ హార్వెస్టింగ్ 18 ప్రాంతాల్లో 23 సంపులు పనులు ఎంత వరకు వచ్చాయి వాటి పురోగతి పై ఆరా తీశారు. కొన్ని నాళాల ద్వారా నీరు నేరుగా ముసిలోకి పోకుండా భూగర్భంలోకి ఇంకే విధంగా ప్రయత్నాలు చేయాలని దాని ద్వారా భవిష్యత్ లో వాటర్ సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఇప్పటికే 90 రోజుల వాటర్ హార్వెస్టింగ్ ప్రోగ్రాంలో భాగంగా పెద్ద పెద్ద అపార్ట్మెంట్ లలో ఇంకుడు గుంతలు నిర్మించుకునేల ప్రజలకు అవగాహన కల్పించాలనీ సూచించారు. భావి తరాలకు నీటి వనరులు అందించే సామాజిక బాధ్యతను అందరూ పాటించాలన్నారు. నగరంలో ఎక్కడ పెండింగ్ పనులు ఉన్న వేగంగా పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలో జీహెచ్ఎంసీ సీ సి పీ శ్రీనివాస్ , ఎస్ ఆర్ డి పి ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ ఎం దేవానంద్ , ఎస్ ఎన్ టి పి చీఫ్ ఇంజనీర్ కోటేశ్వర రావు ,చీఫ్ ఇంజనీర్ మైంటనేన్స్ భాస్కర్ రెడ్డి ఆరు జోన్ల ఎస్ సి లు తదితర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# డెలివరీ బాయ్స్‌కు ఖాళీ సిలిండర్లు ఇవ్వద్దు

**వారి అకౌంట్లో డబ్బులు వేయవద్దు**
**ప్రియాంక గ్యాస్ సర్వీసెస్ యజమాని వీ టి. విజయ్ కుమార్**

శంషాబాద్ అక్టోబర్ 28( ప్రభాత ఉదయం) గ్యాస్ సిలిండర్లు సప్లై చేసే బాయ్స్ కు ఖాళీ సిలిండర్లు అప్పగించరాదని శంషాబాద్ లోని ప్రియాంక గ్యాస్ సర్వీసెస్ యజమాని వీ టి. విజయ్ కుమార్ తెలిపారు . సిలిండర్లు డోర్ డెలివరీ చేసే బాయ్స్ కు ఖాళీ సిలిండర్లు కానీ వారి వ్యక్తిగత అకౌంట్లో డబ్బులు జమ చేయడం కానీ చేయకూడదని తెలిపారు. గతంలో సంస్థలో పనిచేసే మానివేసిన కొంతమంది డెలివరీ బాయ్స్ కస్టమర్ల ఇళ్ల వద్దకు వెళ్లి ఖాళీ సిలిండర్లు ఇవ్వాలని తర్వాత వాటిని మీకు అప్పగిస్తామని చెబుతున్నట్లు తమకు ఫిర్యాదు వచ్చిందని విజయ్ కుమార్ తెలిపారు. ఎవరికి కూడా ఖాళీ సిలిండర్లు ఇవ్వకూడదని వారు తెలిపారు. దానితోపాటు వారి వ్యక్తిగత అకౌంట్లో డబ్బులు కూడా జమ చేయరాదని సూచించారు. కస్టమర్లకు ఎవరికైనా ఏదైనా అవసరం ఉన్న అనుమానం ఉన్న. 90002 22598 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని వారు సూచించారు. కస్టమర్లు డబ్బులు ఇచ్చిన. ఖాళీ సిలిండర్లు ఇచ్చిన తమకు సంబంధం లేదని అన్నారు. ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ పేరు చెప్పి మోసాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



# ప్రభుత్వం మీడియా పాలసీని తీసుకురావాలి

**ఎన్ యు జే ఐ జాతీయ ఉపాధ్యక్షులు పురుషోత్తం నారగౌని**

వేములవాడ,అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం) ప్రభుత్వం మీడియా పాలసీని తీసుకురావాలని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఎన్ యు జే ఐ జాతీయ ఉపాధ్యక్షులు పురుషోత్తం నారగౌని డిమాండ్ చేశారు. సోమవారం వేములవాడ లోని మొదటి బైపాస్ రోడ్ లోని ఇండియా టీవీ కార్యాలయంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయు) రాజన్న సిరిసిల్ల జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది సమావేశానికి టీఎస్ జేయు వేములవాడ నియోజకవర్గ అధ్యక్షులు కోడం కనకయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపని నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ... జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు సంక్షేమ పథకాలతో పాటు హెల్త్ కార్డులు, హౌసింగ్ సొసైటీలు, అక్రిడేషన్లు తదితర అంశాల విషయంలో రాష్ట్ర స్థాయిలో ఒక పాలసీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టుకు యజమాన్యాలు జీతాలు ఇవ్వాలని ఆయన కోరారు. మనకోసం మనం జనం కోసం మనంగా జర్నలిస్టులు పనిచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఒకే జర్నలిస్టు సంఘాన్ని కాకుండా రిజిస్టర్ అయిన అన్ని సంఘాలను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వమే నేరుగా దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా కొల్లూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జి. నరేష్, కోశాధికారిగా సిహెచ్ ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా జె. మల్లేశం, టీ. నరసింహ స్వామి, ఏ. శ్రీనివాస్, దూస రాజేందర్, సంయుక్త కార్యదర్శిగా సిహెచ్. దేవదాస్, ఎన్. రామకృష్ణ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సిహెచ్. బాబు, కార్యవర్గ సభ్యులు ఆర్. రాంప్రసాద్, బి. సంజయ్, బి బాలకృష్ణ, కె. మల్లేష్, జి. గణేష్, చందు, సురేష్, నరేష్, సంతోష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన కొల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా యూనియన్ జాతీయ రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.



# టీఎస్ జెయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులుగా బాపురెడ్డి

సిద్దిపేట,అక్టోబర్ 28 (ప్రభాత ఉదయం) తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు) సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం సోమవారం శివాన్ భవ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ నాయకులు బాపురెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి నేషనల్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఇండియా) జాతీయ ఉపాధ్యక్షులు ఎన్. పురుషోత్తం, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపాని నాగరాజు ముఖ్యఅతిథులు హాజరయ్యారు. సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ... జిల్లాలో జర్నలిస్టులందరికి ఇల్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే జర్నలిస్టుల నుంచి ఇండ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. మన కోసం మనం, జనం కోసం మనంగా జర్నలిస్టులు పని చేయాలని పురుషోత్తం అన్నారు. చిన్న పత్రికలను ఎంప్యానల్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షునిగా చింతలపల్లి బాపురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో పది రోజులలో పూర్తి స్థాయి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా బాపురెడ్డి మాట్లాడుతూ... తనను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జాతీయ, రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో టీఎస్ జెయు జిల్లా నాయకులు కొత్తపల్లి రాజేందర్, గుడి భాను ప్రకాష్, బడుగు భాస్కర్, గుడిసె ప్రభు, బచ్చని శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ను విడుదల చేస్తున్న కలెక్టర్ సంతోష్

# డయేరియా, ఎనిమియా ముక్తభారత్ గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం)సోమవారం ఐ.డి.ఓ.సి సమావేశం హాల్ నందు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోడపత్రికను అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్ రావు, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ... డయేరియా పోస్టర్స్ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, బస్తీ దవకానాలకు, సబ్ సెంటర్లకు, జిల్లా ఆస్పత్రికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పోస్టర్ల ద్వారా ప్రజలకు నీళ్ల విరోచనాల వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎనిమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా గోడపత్రికలను అన్ని తరగతుల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రైమరీ స్కూల్స్ కి, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ కి,హైస్కూల్స్ కి, విద్యాశాఖ ద్వారా పంపిస్తున్నామని, ఈ పోస్టర్స్ లను ఉపాధ్యాయులు తీసుకొని విద్యార్థులకు రక్తహీనత (ఎనీమియా)రాకుండా ఎలా నివారించుకోవాలో అనే విషయం గురించి అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు తీసుకోవాల్సిన పోస్టాహారం, మంచి అలవాట్లపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, బస్తీ దవఖానాలకు అర్బన్ సెంటర్లకు సబ్ సెంటర్లకు అంగన్వాడీ సెంటర్లకు సరఫరా చేస్తున్నామని, ఈ పోస్టర్స్ ద్వారా వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది విద్యార్థులకు, ప్రజలకు పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, ఐరన్ అండ్ పోలిక్ యాసిడ్ మాత్రలు వయసు ప్రకారం, డోస్ ప్రకారము ఎలా వేసుకోవాలో అనే విషయాల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.సిద్ధప్ప, ఆర్.డి.ఓ. రామచందర్, జిల్లా సంక్షేమ శాఖల అధికారిని సుధారాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు, తదితరులు. పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్

# ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ధరూర్, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం) ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు సోమవారం ధరూర్ మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దారు అలివేలు మంగమ్మ కు వినతి పత్రం అందజేశారు.తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావల్సిన 4 డి ఏ లు ,ఈ –కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేయలని , పి ఆర్ సి కమిటీ రిపోర్ట్ తెప్పించుకొని నవంబర్ 22వ వరకు పరిష్కరించాలని లేనియెడల 23 తేదీన హైదరాబాద్ లో ధర్మాగ్రహదీక్ష చేపడుతామని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ధరూరు మండల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ధరూర్ మండల అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి , సంఘం నాయకులు ప్రవీణ్ కుమార్ , లక్ష్మీనారాయణ, మోహన్ రెడ్డి,ఆంజనేయులు,మోహన్, హరి వంశీ ,రాజేష్, సురేష్, చక్రవర్తి , సురేందర్, బి ఆంజనేయులు పాల్గొన్నారు.



తహసిల్దార్ రవీందర్ దత్ కు మెమోరండం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

# పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్స్ స్కాలర్షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలి

**ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె.వై.ప్రణయ్**

శంషాబాద్, అక్టోబర్ 27( ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం విద్య రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్వో రవీందర్ దత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె వై ప్రణయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 8 వేల కోట్ల దాకా ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ పెండింగ్ లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యార్థుల కు గత 6 సంవత్సరాల నుండి పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు అన్నారు, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు చెల్లించడం లేదని అన్నారు . ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థుల కాలేజీలకు. ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష, సతీష్, సాయి, స్పందన, సోనాలి,ప్రవళిక, తరుణ్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.



తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు



ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌కు తన సమస్యను వివరిస్తున్న ప్రజలు

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(ప్రభాత ఉదయం)ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (35) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డిఓ రామచందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.